# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | శనివారం 23 ఆగస్టు 2024 | సంచిక: 1 సంపుటి: 78

తెలుగు దినపత్రిక


## ఇగ మారరా..? 2

- వైద్యుల నిర్లక్ష్యం.. మహిళకు శాపం..
- కుర్చీలోనే ప్రసవం..
- నొప్పులొస్తున్నాయన్న పట్టించుకోని సిబ్బంది
- నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం





# కేబినెట్, నామినేటెడ్ ఓకే..?

## పదవుల పంపకం..

### అధిష్ఠానం క్లియరెన్స్..!

- టీపీసీసీగా మహేశ్ కుమార్ గౌడ్..?
- పంతం నెగ్గించుకున్న సీఎం రేవంత్..
- ఆరుగురికి మంత్రి పదవులు..!
- ఢిల్లీలో రేవంత్ విస్తృత చర్చలు, సమాలోచనలు..






**ఢిల్లీలో పదవుల పంపకం రాష్ట్ర పార్టీలోని పదవుల పంపకం ఢిల్లీ కేంద్రంగా కొలిక్కి వచ్చాయి. ఊరిస్తూ, ఉసూరుమనిపిస్తూ వచ్చిన ఆశల పల్లకీ ఎట్టకేలకు రేవుకు చేరింది. బెర్త్ దక్కినట్టుగా సమాచారం ఉన్నవారు సంబురపడుతుండగా, ఇంకా అధికారికంగా వెలువడలేదుగా అని ఆశావహులు ఆత్రుతగా గడుపుతున్నారు. ఎట్టకేలకు సీఎం అండ్ టీంకు ప్రాధాన్యత పోస్టులు దక్కే అవకాశాలున్నట్టు మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. మరీ ముఖ్యంగా టీపీసీసీ పీఠం మహేశ్ కుమార్ గౌడ్ ను వరించేందుకు సిద్ధమైనట్టు దాదాపుగా తేలడంతో మిగతావారు మౌనం దాల్చుతున్నారు. రాష్ట్రంలో పార్టీకి కొత్త జవసత్వాలు తీసుకొచ్చి అధికారం చేపట్టే దిశగా నడిపించిన రేవంత్ కు అధిష్ఠానం కూడా అదేస్థాయిలో ప్రాధాన్యం ఇచ్చి పదవుల పంపకంలో చిన్నబుచ్చుకోకుండా చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు నామినేటెడ్, కేబినెట్ కూర్పు కూడా కొలిక్కి రావడంతో ఇక ప్రకటనే తర్వాయి అని అంతా ఎదురుచూస్తున్నారు.**

జనపదం, హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, రాజకీయ వాతావరణం, ప్రతిపక్ష పార్టీల అప్రకటిత వార్., రుణమాఫీ ఫీడ్ బ్యాక్ వంటి ఎన్నో అంశాలపై చర్చలు జరిపారు. మరీ ముఖ్యంగా ప్రత్యేకంగా రాష్ట్రంలో పీసీసీ మార్పు, కేబినెట్ పదవుల పంపకం, నామినేటెడ్ పోస్టుల కేటాయింపు పై సుదీర్ఘ కసరత్తు చేశారు. ఆశావహులను ఊరించే విషయానికి ఫుల్ స్టాప్ పెట్టాలని, సాధ్యమైనంత ఎక్కువ మందికి పదవులు పంచి అసంతృప్తుల జాడలేవి కనిపించకుండా చర్యలు తీసుకోవాలని మూకుమ్మడిగా డిస్కషన్ చేసినట్టు తెలుస్తోంది.

......(తరువాయి 3లో)



## మహేశ్ కే మకుటం...?

- టీపీసీసీగా బీసీ నేతకే అవకాశం..
- గెలిచి నిలుపుకున్న రేవంత్..
- అనుయాయుడికి ఇప్పించుకునే కార్యంలో సక్సెస్..

దాదాపుగా అనుకున్నది అనుకున్నట్టే.., అంతా ఊహించినట్టే. సీఎం తర్వాత ఇంచుమించు ఆ స్థాయి వ్యక్తి. రాష్ట్ర పార్టీ సారథి. అంతటి హోదాను ఎవరు మాత్రం ఇతరులకు కట్టబెడుతారు, ఎందుకు వేరే వారికి వదులుతారు. తాను వదులుకోవాల్సిన సీటును తన వారికే దక్కేలా చూసుకోవడంలో తప్పులేదు., తప్పదు కూడా. సీఎం రేవంత్ కూడా ఆ పంథాలోనే కదిలారు., పంతం నెగ్గించుకున్నారు. పావులు కదిపి అనుకున్నది సాధించారు. తనవాడిగా, నమ్మిన బంటుగా మసులుకునే మహేష్ కుమార్ గౌడ్ కే పట్టం దక్కేలా అధిష్ఠానాన్ని ఒప్పించి విజయం సాధించారు. రేపోమాపో ప్రకటించడమే తరువాయి పీసీసీ ఛీఫ్ గా దాదాపు మహేష్ కుమార్ గౌడ్ ఫైనల్ అయ్యారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం.





# స్పీడ్.. స్పీడ్‌గా..

## రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక మిషన్

- 19 ప్రాజెక్టులపై స్పెషల్ ఫోకస్
- ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ
- పనులను వేగంగా పూర్తి చేసే సంకల్పం
- ఆన్ లైన్ లో పోర్టల్ రూపకల్పన..
- ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ.. క్రాస్ చెకింగ్..
- నెలకోసారి అధికారులతో పనులపై రివ్యూ..

జనపదం, హైదరాబాద్ బ్యూరో

ఆలస్యానికి అవకాశం లేకుండా, జాగుకు ఏ మాత్రం ఛాన్స్ ఇవ్వకుండా పనుల పరుగే పరుగు. కాలయాపనతో పనులన్నీ నత్తనడక సాగుతూ ఫలాలు జనాలకు అందే సమయానికి జరగాల్సిన నష్టం జరగకుండా నివారణ చర్యల్లో భాగంగానే రాష్ట్ర సర్కార్ తీసుకొచ్చింది ఈ స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ). జవాబుదారీతనం కొట్టొచ్చినట్టు కనిపించేలా., నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు అనే సంకేతాలు ఇచ్చేలా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్ స్పీడ్ స్పీడ్ గా పట్టాలెక్కడానికి ఉవ్విళ్లూరుతున్నది.

**మరో ముందడుగు..**

రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన అడుగు ముందుకేసింది. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంది. స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) పేరుతో కొత్త కార్యాచరణ చేపడుతోంది. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన 19 ప్రాజెక్టులు, పనులను స్పీడ్ పరిధిలో చేర్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే వీటిని స్వయంగా సమీక్షిస్తారు. సంబంధిత విభాగాల అధికారులతో నెలకోసారి ......(తరువాయి 2లో)




## సహనానికి పరీక్షొద్దు..

- అధికారమెవరికీ శాశ్వతం కాదు..
- కాంగ్రెసోళ్లు కవ్వింపులకు దిగుతున్నారు..
- చర్యకు ప్రతిచర్య ఉంటుంది..
- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆధారాలతో సహా డీజీపీకి ఫిర్యాదు.. 3

# మూగ వేదన వినండి..



- పశువులకు వైద్య సేవలు పెంచండి..
- 1962 సంచార వాహనాలను పునరుద్ధరించాలి..
- సరిపడ మందులు అందించాలి..
- సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు వినతి..
- పశు సమస్యలు తెలియజేస్తే బహిరంగ లేఖ 2



## అవకాశం ఇవ్వండి..

- టీఫైబర్ కు వడ్డీ లేని రుణాలు కావాలి..
- రూ.1779 కోట్లు అవసరం..
- రాష్ట్రంలో 90 లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్ లక్ష్యం..
- టెలికం మంత్రిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి.. 2

## ఆటవిడిది హైదరాబాద్

- ఒలింపిక్ నిర్వహణకు ఛాన్స్ ఇవ్వండి
- ఖేలో ఇండియా నిధులు పెంచాలని వినతి..
- క్రీడా మంత్రి మాండవీయకి విన్నపం.. 3

## నో ప్రాబ్లమ్.. కూల్చండి..



- బఫర్ జోన్‌లో ఉంటే వదులొద్దు..
- నాదైనా సరే నేలమట్టం చేయండి..
- హైడ్రా అంటేనే హడలుతున్నారు..
- నన్ననే అవకాశం వాళ్లకివ్వను..
- నిబంధనలు అందరికి సమానమే..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 2

## రాహులా.. రాహువా..?



- పబ్బు, క్లబ్బుల్లో తిరిగేటాయన కాబోయే ప్రధానా..?
- పెండ్లిపై తేల్చాలని రఘునందన్ డిమాండ్
- సరాసరి రాహులింటికి ఎంపీ
- బంగ్లా మ్యాగజిన్ కథనంపై ఆరా..
- బీజేపీ, కాంగ్రెస్ మధ్య 'హిండెన్ బర్గ్' చిచ్చు.. 2

స్పోర్ట్స్ వార్తలు

### యూట్యూబ్ రికార్డ్..




క్రిస్టియానో రొనాల్డో తన అభిమానుల కోసం ఓ యూట్యూబ్ చానెల్ పెట్టాడు. చానెల్ స్టార్ట్ చేసిన 24 గంటల్లోనే 23 మిలియన్ల సబ్ స్కైబర్ల సంఖ్యను దాటి 2.51 కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టింది.

### కేఎల్ రాహుల్ రిటైర్మెంట్..!



క్రికెటర్ కేఎల్ రాహుల్ పేరుతో చేసిన చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్టుపై దుమారం రేగుతోంది. అందులో ఆయన రిటైర్మెంట్ ప్రకటించినట్లు ప్రచారం జరుగుతోంది.

సినిమా వార్తలు

### ఫస్ట్ డే కలక్షన్స్ 3 కోట్లు




చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా రీ రిలీజ్ అయిన బ్లాక్ బస్టర్ మూవీ ఇంద్ర వరల్డ్ వైడ్ గా మొదటి రోజు రూ. 3.05 కోట్లను రాబట్టింది.

### రవితేజకు గాయాలు..



భాను దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న ఆర్‌టీ -75 షూటింగ్ హైదరాబాద్ శివారు అల్యూమినియం ఫ్యాక్టరీలో ఫైట్ సీన్‌లో ప్రమాదం. ఇందులో రవితేజ తీవ్రంగా గాయపడ్డాడు. 6 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని కోరిన అపోలో హాస్పిటల్ డాక్టర్లు..

# మూగ జీవాలను బతికించండి..

- వైద్యాన్ని విస్మరించిన సర్కార్..
- దవాఖానల్లో మందుల్లేవ్..
- 1962 సర్వీస్ లపై నిర్లక్ష్యం
- నట్టల నివారణ మందులు సరఫరా చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ



**జనపదం, సిద్దిపేట:** వ్యవసాయంలో రైతన్నకు దన్నుగా నిలుస్తూ, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మూగజీవుల మౌన రోదనను తొలగించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందని విమర్శించారు. పశుసంవర్ధక శాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉన్నప్పటికీ మూగజీవాల మౌన రోదనను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల కొరత ఉన్నదని, 1962 పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయంపై సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు.

### నిలిచిన మందుల సరఫరా...

రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందని ఆరోపించారు. ఎమర్జెన్సీ మందులు సహా పెయిన్ కిల్లర్స్, విటమిన్స్, యాంటీ బయాటిక్స్ వంటి అన్ని రకాల మందుల సరఫరా 9 నెలలుగా నిలిచిపోయింది. పాలిచ్చే జీవులకు పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రెండు వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తోందని, అది వారికి అదనపు ఆర్థిక భారమవుతోందన్నారు.

### నట్టల మందులు సైతం లేవ్..

మూగజీవాల్లో అంతర పరాన్న జీవులను నివారించేందుకు మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయాల్సి ఉంటుందన్నారు. 9 నెలల నుంచి నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవడంతో కాలేయం, జీర్ణాశయం, చిన్నపేగు భాగాల్లో పరాన్న జీవులు చేరి రక్తహీనతకు గురి చేస్తున్నాయని చెప్పారు. దీంతో రోగ నిరోధకశక్తి తగ్గి మూగజీవాలు బలహీనంగా మారుతున్నాయని, దీంతో వ్యాధుల బారిన పడ్డ జీవులు ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యశాలల్లో మందులు లేకపోవడంతో మూగజీవాలకు చికిత్స అందించలేకపోతున్నామని, తప్పనిసరి పరిస్థితిలో మందుల చిట్టీ రాసి బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నట్లు వెటర్నరీ డాక్ట ర్లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

### 1962 దేశానికే రోల్ మోడల్..

అనారోగ్యం పాలైన మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి తక్షణ చికిత్స అందించేందుకు 1962 నెంబర్ తో పశువైద్య సంచార వాహనాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఇది దేశానికి రోల్ మోడల్ గా నిలిచిందని, దీనిపై ప్రశంసలు కురిపించిన కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని సూచించిందన్నారు. అంతటి గొప్ప కార్యక్రమ నిర్వహణను కాంగ్రెస్ సర్కార్ గాలికి వదిలేసిందని ఆరోపించారు. సంచార వాహనాల్లో మందుల కొరత కారణంగా అత్యవసర పరిస్థితుల్లో మూగజీవుల ప్రాణాలు కాపాడాలనే సదాశయం నీరుగారిపోతోందన్నారు. మరోవైపు వాహన ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని పేర్కొన్నారు. అన్నిపశువైద్య శాలల్లో, పశువైద్య సంచార వాహనాల్లో అవసరమైన మందులు ఉండేలా చూడాలని, నట్టల నివారణ మందులు సరఫరా చేయాలని, 1962 పశువైద్య సంచార వాహనాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.' అని లేఖలో పేర్కొన్నారు.

# స్పీడ్.. స్పీడ్‌గా..

(మొదటిపేజీ తరువాయి) సమావేశమవుతారు. ఈ పనులన్నింటినీ నిర్ణీత వ్యవధిలో సమర్థవంతంగా పూర్తి చేయాలనేది స్పీడ్ లక్ష్యం.

### అవరోధాల అధిగమనానికే..

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రామాణికమైన మౌలిక సదుపాయాల కల్పనలో వివిధ విభాగాల మధ్య ఉన్న అడ్డంకులు, అవరోధాలన్నింటినీ అధిగమించేందుకు స్పీడ్ ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. ఆలస్యం జరగకుండా నేరుగా ముఖ్యమంత్రి స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. పట్టణాలకే పరిమితం కాకుండా, అన్ని ప్రాంతాల్లోని అభివృద్ధి పనులపై స్పీడ్ దృష్టి కేంద్రీకరిస్తుంది. స్పీడ్‌లో భాగంగా తమ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు, పనులపై సంబంధిత విభాగాలు ప్రణాళికలు తయారు చేస్తాయి. ఏ గడువులోగా ఎంత పని జరుగుతుందనే నిర్ణీత కాల వ్యవధిని ఇందులో పొందుపరుస్తారు. ఎప్పటివరకు ఏయే పనులు పూర్తవుతాయనే పనుల అంచనాలను ప్రస్తావిస్తారు.

### ప్రత్యేక విధానాలు..

స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఆయా విభాగాలు ప్రత్యేక విధానం అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రమం తప్పకుండా పనితీరును సమీక్షించుకొని పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించింది. స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ప్రణాళిక విభాగం ప్రత్యేకంగా ఆన్ లైన్ పోర్టల్ రూపొందిస్తుంది. ఏ రోజుకు ఎంత పని జరిగిందనే అప్ డేట్ డేటాను ఇందులో పొందుపరుస్తుంది.

**స్పీడ్ ప్రోగ్రామ్ లోని 19 ప్రాజెక్టులు..**

- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్
- శాటిలైట్ టౌన్ల అభివృద్ధి
- మెట్రో రైలు విస్తరణ
- జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ
- రీజినల్ రింగ్ రోడ్
- హైదరాబాద్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు
- రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు
- ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం
- మహిళా శక్తి పథకం అమలు
- జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం
- రెసిడెన్షియల్ స్కూల్స్ కాంప్లెక్సులు
- అమ్మ ఆదర్శ స్కూల్స్ కమిటీల సంస్థాగత అభివృద్ధి
- ఐటీఐలలో అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లు
- కొత్త ఉస్మానియా హాస్పిటల్
- 15 నర్సింగ్, 28 పారా మెడికల్ కాలేజీలు
- హెల్త్ టూరిజం ప్రమోషన్
- ఎకో టూరిజం ప్రాజెక్టుల ప్రమోషన్
- టెంపుల్ సర్క్యూట్స్ టూరిజం
- యాంటీ డ్రగ్స్ స్ట్రాటజీ అమలు

# టీ-ఫైబర్‌కు వడ్డీ రహిత రుణం ఇవ్వండి

- రూ.1779 కోట్లు అందించండి
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కోరిన సీఎం



**జనపదం, ఢిల్లీ:** తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోని 63 లక్షల గృహాలు, పట్టణ ప్రాంతాల్లోని 30 లక్షల గృహాలకు నెలకు రూ.300కే ఫైబర్ కనెక్షన్ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర టెలికం, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను సీఎం, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం కలిశారు. టీ-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు ఆప్టికల్ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా కనెక్టివిటీని కల్పించడం తమ ఉద్దేశమని కేంద్ర మంత్రి సింధియాకు సీఎం వివరించారు. 65,500 ప్రభుత్వ సంస్థలకు జీ2జీ (గవర్నమెంట్ టూ గవర్నమెంట్), జీ2సీ (గవర్నమెంట్ టూ సిటీజన్) కనెక్టివిటీ కల్పించడంతో పాటు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల గృహాలు, పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు నెలకు కేవలం రూ. 300 కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు అందించాలని తమ ప్రభుత్వం యోచిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 300 రైతు వేదికలకు టీ-ఫైబర్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోందని, సాంఘిక సంక్షేమ పాఠశాలలకూ టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రూ. 1779 కోట్ల పెట్టుబడులతో ప్రతిపాదించిన టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 530 కోట్లను వివిధ ఆర్థిక సంస్థల ద్వారా సమీకరించిందని కేంద్ర మంత్రి సింధియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. మొత్తం పెట్టుబడి వ్యయం రూ. 1,779 కోట్లను యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్ఎఫ్ఓ) ద్వారా వడ్డీ లేకుండా దీర్ఘకాలిక రుణంగా ఇవ్వాలని కేంద్ర మంత్రి సింధియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ (ఎన్ఓఎఫ్ఎన్) మొదటి దశ మౌలికసదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో అందించాలని కేంద్ర మంత్రి సింధియాను ముఖ్యమంత్రి కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ లైనియర్ ఆర్కిటెక్చర్ ఆధారంగా నడుస్తుంటే... మిగితా ప్రాంతాల్లో రింగ్ ఆర్కిటెక్చర్ ఆధారంగా టీ-ఫైబర్ నడుస్తోందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఈ రీత్యా నెట్ వర్క్ సమర్థ నిర్వహణ, వినియోగం కోసం సకాలంలో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ మౌలిక సదుపాయాలకు అందించాలని ప్రతిపాదించారు. ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశను భారత్ నెట్ – 3 ఆర్కిటెక్చర్ కు మార్చడానికి గతేడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ను పంపించిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ డీపీఆర్‌ను త్వరగా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

# రాహుల్ గాంధీ ఇంటికి రఘునందన్

- బీజేపీ, కాంగ్రెస్ మధ్య హిండెన్‌బర్గ్ నివేదిక చిచ్చు
- రాహుల్ గాంధీకి పెళ్లయిందని బంగ్లా మ్యాగజైన్ కథనం
- నివేదికపై స్పందించాలని బీజేపీ ఎంపీ డిమాండ్



**జనపదం, ఢిల్లీ:** బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఢిల్లీలోని సోనియా గాంధీ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గురించి బంగ్లాదేశ్‌కు చెందిన బ్లిట్జ్ పత్రిక ప్రచురించిన కథనాలను తన వెంట తీసుకెళ్లారు. తొలుత గేట్ వద్ద ఆయనను భద్రత సిబ్బంది ప్రశ్నించి, వచ్చిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనను లోపలికి అనుమతించారు. ఆ సమయంలో పార్టీ నాయకులతో సమావేశమైన రాహుల్ గాంధీ.. జమ్మూ కశ్మీర్, హరియాణా శాసనసభ ఎన్నికలపై చర్చిస్తున్నారు. రాహుల్ అందుబాటులో లేకపోవడంతో బ్లిట్జ్ మ్యాగజైన్ కాపీలను అక్కడి రిసెప్షన్ సిబ్బందికి అప్పగించి బయటికి వచ్చారు.

### వివరణ కోసమే..

రాహుల్‌కు బేకన్, బీఫ్ అంటే చాలా ఇష్టమని, ఆయన ఆహార, జీవనశైలి పూర్తిగా హిందూమతానికి భిన్నమైనని ఇటీవల బ్లిట్జ్ పత్రిక ఓ కథనం ప్రచురించింది. రాహుల్ హిందువని తాము భావించలేదంటూ ఆయన స్నేహితుడిని ఉటంకిస్తూ ఓ కథనాన్ని వెలువరించింది. అంతేకాదు, రాహుల్ గాంధీకి వివాహమైందని, ఆయనకు పిల్లలు ఉన్నారంటూ కథనంలో పేర్కొనడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో కథనంపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రఘునందన్ రావు.. నేరుగా రాహుల్ ఇంటికి వెళ్లినట్లు ఆయన చెప్పారు. ఇందులో వచ్చిన కథనాలకు ఏ సమాధానం చెబుతారని, ఇప్పటివరకు ఎవరూ దీని గురించి మాట్లాడలేదని, అందుకే తాను నేరుగా రాహుల్‌ను కలిసి వివరణ తీసుకోవడానికి వచ్చానని బీజేపీ ఎంపీ వెల్లడించారు. ఒకవేళ, అది తప్పుడు కథనం అయితే, ఎందుకు నోటీసులు ఇవ్వలేదని, లేకుంటే ఆ ఫొటోలోని మహిళ రాహుల్ భార్య అని చెప్పాలని నిలదీశారు. కాబోయే ప్రధాని అని చెప్పుకునే రాహుల్ గాంధీ విదేశాల్లో పబ్, క్లబ్బుల్లో అమ్మాయిలతో తిరగడమేంటని ఆయన ప్రశ్నించారు.

# అధిష్ఠానం క్లియరెన్స్..!

(మొదటిపేజీ తరువాయి) తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు పావులు చకచకా కదులుతున్నాయి. రాష్ట్రంలో పదవుల పంపకానికి కాంగ్రెస్ అధిష్ఠానం క్లియరెన్స్ ఇచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే ఆలస్యమైన నేపథ్యంలో అసంతృప్తులు పెరుగుతున్నారనే ఆలోచనతో ఓ కొలిక్కి తెచ్చినట్టు వినికిడి. ఢిల్లీలో పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరిపిన సీఎం తిరుగు ప్రయాణం అయ్యారు. కేబినెట్ లో మరో ఆరుగురికి అవకాశం కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కాగా, ముఖ్యమంత్రిని పలుమార్లు కేబినెట్, నామినేటెడ్, పీసీసీ నియామకాల విషయమై చర్చించడానికి ఢిల్లీకి పిలిచినా అప్పటి అత్యవసరాల మేరకు వాయిదాపడుతూ వచ్చిన విషయం తెలిసిందే. మొన్నటికి మొన్న ఆగస్టు 15వ తేదీన కూడా సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన సందర్భంలో ఇక తేల్చుకుని వస్తారని భావించినా నిరాశే మిగిలింది. తాజాగా గురువారం హస్తినా నుంచిపిలుపు రావడంతో రాత్రికి రాత్రే వెళ్లిన ముఖ్యమంత్రి శుక్రవారమంతా బిజీబిజీగా గడిపారు. కేబినెట్, నామినేటెడ్, పీసీసీ నియామకాలపై కంక్లూజన్ కు వచ్చారు. అధిష్ఠానం గతంలో మాదిరిగా నాన్చకుండా తేల్చి మరీ పంపినట్టు తెలిసింది.

### పంతం నెగ్గించుకున్న సీఎం రేవంత్...


ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రి వర్గ విస్తరణ ఇప్పటి వరకు జరగలేదు. వివిధ కారణాలతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తున్న కార్యక్రమం తాజాగా శుక్రవారంతో ఫైనల్ కాగా, రాష్ట్ర మంత్రి వర్గంలో ఆరుగురికి కేబినెట్ బెర్త్ లు కన్ఫమ్ అయినట్టు తెలుస్తోంది. అందులో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, శ్రీహరి ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, రామచంద్రనాయక్ లు మంత్రులుగా అవకాశం లభించినవారుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు పార్టీ పెద్దలతో సీఎం రాష్ట్ర మంత్రివర్గ కూర్పు, ఇతర పదవులు కేటాయింపులపై విస్తృతంగా చర్చలు జరిపి కొలిక్కి తెచ్చారు.

### కేబినెట్ లో 'సామాజిక' న్యాయం..

ఎట్టకేలకు ముఖ్యమంత్రి పంతం నెగ్గించుకున్నారు. అనుకున్న వారికి అనుకున్నట్టుగా పదవులు ఇప్పించుకుని తన బలాన్ని మరో మారు చాటారని పార్టీలోని ఓ వర్గం కితాబిస్తోంది. కాగా, కేబినెట్ విస్తరణలో సామాజిక న్యాయం పాటించారని కూడా మెచ్చుకుంటోంది. కాగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేష్ కుమర్ గౌడ్ టీపీసీసీగా దాదాపుగా ఖరారైనట్టు తెలుస్తుండడంతో కేబినెట్ లో సామాజిక వర్గాలకు మరింత సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెలలోనే వరంగల్‌లో సభ పెట్టే యోచనలో నేతలు ఉండగా, ఈ గ్యాపులోనే కేబినెట్ తో పాటు నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తి చేయాలని నిర్ణయించారు.

# నో ప్రాబ్లమ్.. కూల్చండి..

- బఫర్ జోన్‌లో ఉంటే వదులొద్దు..
- నాదైనా సరే నేలమట్టం చేయండి..
- హైడ్రా అంటేనే హడలుతున్నారు..
- నన్నే అవకాశం వాళ్లకివ్వను..
- నిబంధనలు అందరికీ సమానమే..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందించారు. ఇటీవల కేటీఆర్ అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రా ముందుగా బఫర్ జోన్‌లో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫామ్ హౌజ్‌ను కూల్చివేయాలని బీఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో కేటీఆర్ తనపై చేసిన విమర్శలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉన్నట్లు.. కేటీఆర్, హరీశ్‌రావు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. అలాగే ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో తనకు సంబంధించి ఒక్క ఇటుక ఉన్నా టేప్ పెట్టి కొలిచి కూలగొట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు చెబుతున్నానని చెప్పారు. ఒకవేళ తాను అధికారంలో ఉన్నందున అధికారులపై నమ్మకం లేకపోతే మీరే వెళ్లి.. కొలిచి నిర్ణయించాలని కేటీఆర్, హరీశ్‌రావుకు సూచించారు. అంతేకాదు, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులతో మాటలుపడే అవకాశం ఈ పొంగులేటి ఎప్పుడూ ఇవ్వబోదని అన్నారు. ప్రతిపక్ష హోదాను, పార్టీని కాపాడుకునేందుకు రెవెన్యూ మంత్రిగా ఉన్న తనపై అక్రమాల పేరుతో ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాదు, మీలాగా నేను ఉండే ఇల్లు నాది కాదని చెప్పనని పొంగులేటి అన్నారు. జన్వాడ ఫామ్ హౌస్ తనది కాదు.. తన స్నేహితుడిదని, లీజుకు మాత్రమే తీసుకున్నానని చెబుతోన్న కేటీఆర్ దానిపై డ్రోన్‌లు ఎగురవేశారని రేవంత్‌రెడ్డిపై కేసులు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ఆ ఎఫ్ఐఆర్‌లో కేటీఆర్ నివాసంపైనే అక్రమంగా డ్రోన్‌లు ఎగరేశారని ఎందుకు పేర్కొన్నారని పొంగులేటి నిలదీశారు. మీలాగా తాను బుకాయించానని, తాను ఉంటున్న ఇల్లు ప్రస్తుతం నా కొడుకు పేరుతో ఉందని తెలిపారు. అయిననప్పటికి మీలాగా నేను తప్పించుకోనని, అది నా ఇల్లుగానే చెబుతానని అన్నారు. సామాన్యుల మేలు కోసమే తమ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. గత పదేళ్లలో న్యాయస్థానాలు చెప్పినా పట్టించుకోకుండా బఫర్ జోన్‌లలో బీఆర్ఎస్ మంత్రులు, ప్రజాప్రతినిధులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని మండిపడ్డారు. అవన్ని సక్రమమైతే హైడ్రాను చూస్తే వారికి ఎందుకు భయమని ప్రశ్నించారు. హైడ్రాపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, కోర్టు కూడా స్వాగతించిందని మంత్రి గుర్తు చేశారు.

# ఏసీబీకి చిక్కిన స్టేట్ టాక్స్ ఆఫీసర్

- వ్యాపారి వద్ద రూ.50వేలు డిమాండ్
- రూ.35వేలు ఇస్తుండగా పట్టుకున్న అధికారులు



**జనపదం, హైదరాబాద్:** వ్యాపారి నుంచి రూ.35 వేలు లంచం తీసుకుంటూ ఇన్ కం ట్యాక్స్ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కారు. అబిడ్స్‌లోని కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో స్టేట్ టాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఇందిరా రెండు రోజుల క్రితం నారాయణగూడ ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారికి జీఎస్టీ పెండింగ్‌లో ఉందంటూ, నోటీసులు జారీ చేశారని ఏసీబీ డీఎస్పీ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జీఎస్టీ చెల్లింపుతో పాటు భవిష్యత్‌లో అతని వ్యాపారానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే రూ.50 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. చివరకు రూ.35వేలకు ఒప్పందం కుదిరిందని, అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని వ్యాపారి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అబిడ్స్‌లోని కార్యాలయంలో రూ.35 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారి ఇందిరాపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.



# తిరుమలలో బంగారు ఫ్యామిలీ

**జనపదం, తిరుపతి:** శ్రీవారిని దర్శించుకునేందుకు ఓ బంగారు ఫ్యామిలీ తిరుమలకు వచ్చింది. ముంబయికి చెందిన ఆ కుటుంబం సుమారు 15 కేజీల బరువుండే బంగారు ఆభరణాలను ధరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం బయటకు ఆలయ పరిసరాల్లో కలియ తిరిగారు. వారిలో ఇద్దరు 10 కేజీల చొప్పున బంగారాన్ని ధరించగా, మరొకరు 5 కేజీల బంగారాన్ని అలకరించుకున్నారు. ఈ బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.15 కోట్లగా ఉంటుందని అంచనా. ఇంత భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు ధరించి శ్రీవారి దర్శనానికి రావడంతో తిరుమల గిరులపై దర్శనానికి వెళ్లిన భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. వారిని ఆసక్తిగా తిలకించారు. ఇంత బంగారమా అంటూ తీక్షణంగా చూశారు. ఆలయం ఎదుట ఉన్న భక్తులు వారిని చూసి సెల్ఫీలు దిగడానికి ప్రయత్నించారు.ఇక వారి రక్షణ కోసమే సుమారు 15 మంది సెక్యూరిటీ సిబ్బంది రావడం మరో విశేషం.

# పబ్లిక్ ప్లేస్‌లో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

**పోలీసుల వార్నింగ్.. పిచ్చి చేష్టలు చేయొద్దని హెచ్చరిక**




**జనపదం, క్రైం:** నేటి రోజుల్లో సోషల్ మీడియా లేనిదే బతుకు భారమనేలా పరిస్థితి తయారైంది. ఉదయం లేచిన దగ్గర నుంచి యువత సోషల్ మీడియా వెనుక పరుగులు తీస్తున్నారు. పొద్దున లేచింది మొదలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో షార్ట్స్, రీల్స్ అంటూ సెల్‌ఫోన్ పట్టుకుని చక్కర్లు కొడుతున్నారు. సరే ఎవరిష్టం వారిది అనుకున్నా.. తమ రీల్స్, షార్ట్స్ లైకుల కోసం మరీ తెగించేస్తున్నారు. ప్రాణాలకు తెగించి రిస్క్ చేసేది కొంతమంది అయితే.. పక్కోడి ప్రాణాలను సైతం రిస్కులో పెట్టే మహానుభావులు మరికొంత మంది. తమ యూట్యూబ్ ఛానెల్‌కు సబ్‌స్క్రైబర్లు పెంచుకునేందుకు, తమ రీల్స్‌కు వ్యూస్ తెచ్చుకునేందుకు పబ్లిక్ ప్లేసులను సైతం వాడేస్తున్నారు. బహిరంగ స్థలాలలో రీల్స్, షార్ట్స్ తీస్తూ జనాలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇలాంటి వారికి తెలంగాణ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో రీల్స్ చేస్తూ పబ్లిక్ న్యూసెన్స్ చేసే వారి మీద కేసులు పెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వీడియోల కోసం సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బంది పెట్టొద్దని పోలీసులు సూచించారు. రీల్స్ కోసం ప్రజలకు ఇబ్బంది కలిగేలా పిచ్చి చేష్టలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు పబ్లిక్ ప్లేసులో నోట్లు వెదజల్లుతూ న్యూసెన్స్ క్రియేట్ చేసిన మహాదేవ్ అనే యూట్యూబర్ మీద కేసులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. మహాదేవ్‌పై పలు సెక్షన్ల కింద కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ పోలీసులు తెలిపారు.

# ఐదు రోజులు వర్షాలు..

**ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**

**జనపదం, హైదరాబాద్:** ఉత్తర పశ్చిమ బెంగాల్, ఈశాన్య జార్ఖండ్ ప్రాంతాల్లో అల్పపీడన ప్రభావం కొనసాగుతుంది. దీనికి అనుబంధంగా ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కి.మీ ఎత్తులో కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండగా.. మరో 5 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీచేసింది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ జనగామ, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిచే ఛాన్స్ ఉందని వివరించారు. ఈ మేరకు ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కుర్చీలోనే మహిళ ప్రసవం..

- వైద్యుల నిర్లక్ష్యంతో దారుణం
- నొప్పులొస్తున్నాయన్నా.. పట్టించుకోని సిబ్బంది
- నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన




**జనపదం, నల్లగొండ:** నల్లగొండ జిల్లాలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. జిల్లా ప్రభుత్వ దవాఖానలో వైద్యుల నిర్లక్ష్యంతో కుర్చీలోనే ఓ మహిళ ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే..జిల్లాలోని నేరడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి అశ్విని గర్భిణి గురువారం రాత్రి పురిటినొప్పులతో జిల్లాలోని దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. అక్కడ డాక్టర్లు లేరని.. నల్గొండ ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది పంపించారు. దేవరకొండ నుంచి అంబులెన్స్‌లో నల్గొండ జిల్లా దవాఖానకు చేరుకున్నారు. ఇక్కడికి ఎందుకు వచ్చారని హాస్పిటల్ సిబ్బంది వారిని ప్రశ్నించారు. మూడో కాన్పు దేవరకొండలో చేయించక ఇక్కడి దాక రావడం ఏంటంటూ అసహనం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యం ప్రదర్శించారు. అంతేకాదు.. నర్సులు అశ్వినిని బయట కుర్చీలోనే కూర్చోబెట్టారు. నొప్పులు వస్తున్నాయి అని చెప్పినప్పటికీఎవరు పట్టించుకోలేదు. తీవ్ర నొప్పులతో బాధ పడుతూ అశ్విని కుర్చీలోనే డెలివరీ అయింది. కుర్చీ కింద తీవ్ర రక్త స్రావం కావడంతో అప్పుడు హాస్పిటల్ సిబ్బంది వచ్చి హడావుడి చేస్తూ పేషెంట్ పైనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ తరువాత లోపలికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లిబిడ్డ క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ దారుణంపై అక్కడే ఉన్న ఇతర రోగుల బంధువులు, ఇతరులు వైద్యులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి మరెవ్వరికి రాకూడదని, నిర్లక్ష్యం చేసిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి భర్త ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ హుటాహుటిగా హాస్పిటల్‌కు వచ్చారు. ఘటనపై వివరాలు సేకరించారు. బాధ్యులపై చర్యల కోసం నివేదికను ఉన్నతధికారులకు అందజేస్తానని తెలిపారు.



# ఆటలకు మహాద్భుతం..

- హైదరాబాద్ @ అంతర్జాతీయం..
- క్రీడల నిర్వాహణకు భేషుగ్గా వసతులు..
- గతం పరిశీలిస్తే చరిత్ర తెలుస్తుంది..
- ఒలింపిక్ నిర్వహణకు ఛాన్స్ ఇవ్వండి
- తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయతో భేటీ..
- ఖేలో ఇండియా నిధులు పెంచాలని వినతి..

**జనపదం, ఢిల్లీ :** జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అ వసరమైన మౌలిక వసతులు తెలంగాణలో ఉన్నాయని, ఇక్కడ నిర్వహించేందుకు అవకాశం ఇ వ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయను కోరారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కేంద్ర మంత్రీ మన్‌సుఖ్ ఎల్ మాండవీయతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో ని స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో అం తర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడి యంలు, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్స్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్ స్పోర్ట్స్, ఇతర క్రీడలకు వసతులు ఉన్నాయని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివివరించారు. భవిష్యత్‌లో ఒలింపిక్స్, ఆసియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ తెలంగాణలో నిర్వహించే అవకా శం ఇప్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. ముఖ్యంగా 2025, జనవరిలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గే మ్స్ కు హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, 2007లో ప్రపంచ మిలటరీ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో యు వత క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏ ర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రేవంత్ రెడ్డి తెలిపా రు. స్పోర్ట్స్ యూనివర్సిటీల్లో క్రీడలకు సంబంధించిన అన్ని రకాల శిక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలి పారు. స్పోర్ట్స్ యూనివర్సిటీకి అవస రమైన ఆర్థిక సహాయం అందజేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలో క్రీడా వసతుల అభివృద్ధికి ఖేలో ఇండియా ప థకం కింద విడుదల చేసే నిధుల మొ త్తాన్ని పెంచాలని కోరారు. జీఎంసీ బా లయోగి స్టేడియం, షూటింగ్ రేంజ్, ఎల్ బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం అప్‌గ్రేడేషన్ కు సమర్పించిన డీపీఆర్‌ల ను ఆమోదించాలని కేంద్ర మంత్రి మన్ సుఖ్ ఎల్ మాండవీయను కోరినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.



## దళిత బంధు నిధులు విడుదల చేయాలి

- ప్రజాభవన్ ముట్టడించిన 500 మంది దళిత బంధు బాధితులు

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఊహించని షాక్ తగిలింది. రెండో విడత మంజూరైన దళిత బంధు నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలిన ప్రజా భవన్ వద్ద శుక్రవారం నిరసనతెలిపారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. లబ్ధిదారులు వారి వారి యూనిట్లను గ్రౌండ్ చేయడానికి రూ. 3 లక్షల నిధులు విడుదల చేయడానికి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే తమ తమ ఖాతాల్లో దళిత బంధు డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాభవన్ ను ముట్టడించారు. లేదంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.



## గద్దర్ అవార్డుల కమిటీలో వేణుకు చోటు

- పలువురి అభినందనలు

**జనపదం, సిరిసిల్ల :** ప్రతిష్టాత్మక 'గద్దర్' అవార్డుల కమిటిలో సీఎం రేవంత్ సర్కారు సిరిసిల్ల ముద్దుబిడ్డ, బలగం సినిమా డైరెక్టర్ వేణు యెల్దండికి స్థానం కల్పించింది. నటుడిగా, డైరెక్టర్ గా, సింగర్ గా.. మల్టీ టాలెంటెడ్ వేణు యెల్దండి సేవలను గుర్తించిన ప్రభుత్వం కమిటీలో స్థానం కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఓ కమెడియన్ గా సినీరంగ ప్రవేశం చేసిన వేణు యెల్దండి.. ఒకే ఒక్క సినిమా మొదటి సినిమా బలగం తో యావత్ తెలుగు, తెలంగాణ ప్రజల మనస్సులు దోచారు. 100 అంతర్జాతీయ అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు సాధించారు. కష్టపడి .. సినీరంగంలో చిన్న స్థాయి నుంచి ఈ స్థాయికి ఎదిగిన సిరిసిల్లకు చెందిన వేణుకు సిరిసిల్ల జిల్లా వాసులు అభినందనలు తెలిపారు.

# సహనానికి పరీక్షొద్దు..

- అధికారమెవరికీ శాశ్వతం కాదు..
- కాంగ్రెసోళ్లు కవ్వింపునకు దిగుతున్నారు..
- చర్యకు ప్రతిచర్య ఉంటుంది..
- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆధారాలతో సహా డీజీపీకి ఫిర్యాదు..



**జనపదం, హైదరాబాద్ :** 'ఖబడ్దార్ కాంగ్రెస్ నాయకులారా.. మా సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఈ వి షయాన్ని పోలీసులు, సీఎం రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి' అని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై కేటీఆర్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్‌తో పాటు ప లువురు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కలిసి రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్‌ను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మధ్యాహ్నం కలిశారు. తుంగతుర్తి రైతులపై, సీఎం రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లిలో జర్నలిస్టులపై జరిగిన దాడులను గురించి డీజీపీకి కేటీఆర్ వివరించి ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిన్న ఒక్క రోజే రెండు ఉదంతాలు చోటు చేసుకున్నాయని, వాటికి సంబంధించి ఆధారాలతో సహా డీజీపీకి ఫిర్యాదు చేశామన్నారు. విద్యార్థి నాయకుడు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్దతిలో శాంతియుతంగా తిరుమలగిరిలో రైతు నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. అయితే 50 మంది కాంగ్రెస్ గుండాలు, తాగిన మత్తులో ఆకస్మాత్తుగా రాళ్లు, గుడ్లు, సుతిలి బాంబులతో దాడి చేశారన్నారు. మా వాళ్లు తిరగబడి ఉంటే ఆ 50 మంది కాంగ్రెస్ మూకలు ఒక్కరు కూడా మిగిలేవారు కాదన్నారు.. కానీ శాంతియుతంగా మేము నిరసన తెలపాలని భావించామని, అందుకే ఎలాంటి ప్రతిఘటనకు పాల్పడలేదన్నారు. పోలీసులే మా నిరసన దీక్షకు సంబంధించిన టెంట్ కూల్చేయటం ఆశ్చర్యం కలిగించిందన్నారు.

### దద్దమ్మ రేవంత్ రెడ్డి

రుణమాఫీ విషయంలో వాస్తవాలను ప్రజల్లోకి పోయి సమాధానం చెప్పలేని దద్దమ్మ రేవంత్ రెడ్డి అని కేటీఆర్ విమర్శించారు. రుణమాఫీపై ఏ ఊరికైనా వెళ్దాం రా.. అని మేము సవాల్ చేస్తే రాలేదు. కానీ ఢిల్లీకి మాత్రం 20 సార్లు పోయిండన్నారు. క్షేత్ర స్థాయిలో తిరగాల్సిన సీఎం ఢిల్లీ చుట్టు చక్కర్లు కొడుతున్నారన్నారు. సీఎంకు దమ్ముంటే ఏ ఊరికైనా పోయి వెళ్లి రుణమాఫీ అయ్యిందా అనే వి షయాన్ని అడుగుదామని, ఎక్కడ కూడా చారాణ రు ణమాఫీ కాలేదు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### జర్నలిస్ట్ లకు రక్షణ కరువు..

కాంగ్రెస్ హయంలో జర్నలిస్ట్ లకే రక్షణ కరువైందని, ఇక రాష్ట్రంలో సామాన్య పౌరుల పరిస్థితి ఏంటని కేటీఆర్ వాపోయారు. రుణ మాఫీ విషయమై ఇద్దరు మహిళ జర్నలిస్టులు సీఎం సొంత ఊరు కొండారెడ్డి పల్లికి వెళ్తే వారిపై కాంగ్రెస్ గుండాలు అసభ్యకరంగా దాడి చేశారని వాపోయారు. అయితే వాళ్లేమైనా ముఖ్యమంత్రి లాగా బజారు బాష మాట్లాడారా? లాగుల తొండలు జొర్రకొడతాం, చెట్టుకు కట్టేసి కొడతాం అన్నారా? అని ప్రశ్నించారు. మహిళా జర్నలిస్టులు అ ని కూడా చూడకుండా కాంగ్రెస్ గుండాలు వారిని వెల్దండ పోలీస్ స్టేషన్ వరకు వెంబడించారని, ఆ ఆడబిడ్డలు ఏం తప్పు చేశారు? అని ప్రశ్నించిన కేటీఆర్ వారికి సీఎం క్షమాపణం చెప్పాలని డిమాండ్ చేశారు. నీ బండారం బయట పెట్టినందుకా? వారి మీద దాడి చేయించావ్ అని సీఎంను ప్రశ్నించారు. అంతే కాకుండా వాళ్ల మీద నికృష్టమైన భాషలో సోషల్ మీడియాలో కాంగ్రెస్ చిల్లర మనుషులు ప్రచారాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

### అత్యుత్సాహం ప్రదర్శించొద్దు..


పోలీసుల మీద మాకు సానుభూతి ఉందని, కానీ కొంత మంది పోలీసులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, అది మంచిది కాదని కేటీఆర్ అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పోలీసులకు సూచిస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసులను, వ్యవసాయ అధికారులను తప్పు బట్టాల్సిన పని లేదని, తప్పు ముఖ్యమంత్రిది, చేతకాని సన్నాసి సీఎందని అన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ లు పెడితే కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తిరుమలగిరి ఘటనలో దాడి చేసిన వారిపై, మహిళా జర్నలిస్ట్ లపై దాడులు చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

### అదుపు తప్పిన శాంతిభద్రతలు

హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, నెల రోజుల్లో 28 హత్యలు అనే వార్తలు వస్తున్నాయని కేటీఆర్ వాపోయారు. ఈ నగరానికి ఏమైంది అంటూ సీఎంకు దన్నుగా నిలిచిన పత్రికలే వార్తలు రాస్తున్నాయన్నారు పోలీసు యంత్రాంగం మీద మాకు సానుభూతి ఉందని, వారిని అడ్డం పెట్టుకొని సీఎం అధికారం చెలాయిస్తున్నాడు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా మా పార్టీ యువకులను వేధిస్తున్నారని, ఇంకా ఇలాగే కొనసాగితే మా నుంచి ప్రతిఘటన కూడా తప్పదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినవద్దనే మేము ఇప్పటి వరకు ఊరుకుంటున్నామని, మా సహనాన్ని, చేతగాని తనం అనుకోవద్దని హెచ్చరించారు. కొంత మంది పోలీసులు మంత్రుల బర్త్ డే కార్యక్రమాల్లో ప రవశించి పోతున్నారని, డీజీపీకి ఇలాంటి పోలీసుల మీద చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అన్ని నిర్మాణాలను కూల్చి వేయాలని, పొంగులేటి, వివేక్, కేవీపీ, మధుయాష్కీ లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ త ర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయాలని కేటీఆర్ సూచించారు. మంచిర్యాలలో ఎమ్మెల్యే కారణంగా మా నాయకుడు గొంతు కోసుకున్నాడని, మొత్తంగా వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ఈ ముఖ్యమంత్రి అధికారం చెలాయించాలనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# రియల్ మాఫియా మాయాజాలం

- బఫర్ జోన్‌లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన నిర్మాణాలు
- అక్రమార్కుల వెనుక అధికార యంత్రాంగం
- నిరభ్యంతరంగా ఎన్ఓసీ లు మంజూరు
- కోట్లు కొడుతున్న బడాబాబులు
- హైడ్రా చర్యలపై సర్వత్రా చర్చ నీయాంశం



**జనపదం, హైదరాబాద్ :** ఆహ్లాదకరమైన వాతావరణంలో.. అతి తక్కువ ధరకే అని ఆకట్టుకొంటూ గ్రేటర్ హైదరాబాద్ లోని చెరువులు, కుంటలు, జలాశయాల పరిధిలో భారీ ఎత్తున నిర్మించిన బహుళఅంతస్థుల భవనాల్లో సింహభాగం అక్రమంగా వెలిసిన వేనని ఆరోపణలున్నాయి. లేక్‌వ్యూ ఫ్రంట్ విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు అంటూ ప్రచారం చేస్తూ రియల్ మాఫియా మాయాజాలంలో సృష్టిస్తుంది. సామాన్య, మధ్యతరగతి వర్గాల నుంచి రూ.కోట్లల్లో కొల్లగొడుతుండగా, ఈ అక్రమాలకు ఆజ్యం పోస్తున్న అధికారులు, ఉద్యోగులు కూడా పెద్ద ఎత్తున ఆర్జిస్తున్నారు. అటు జంట జలాయాలు మొదలుకొని ఇటు నగరంలోని అనేక ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన అక్రమ నిర్మాణాలకు వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారుల ప్రమేయం ఉంది. జలాశయాలను పరిరక్షించాల్సిన నీటిపారుదల శాఖకు చెందిన అధికారులు యథేచ్ఛగా నివాస ప్రాంతాలుగా గుర్తిస్తూ నిరభ్యంతర పత్రాలను (ఎన్ఓసీ) ఇచ్చేస్తుండగా, ఆ శాఖ ఇచ్చే ఎన్ఓసీల ఆధారంగా రెవెన్యూ అధికారులు సైతం నిరభ్యంతర పత్రాలను జారీ చేస్తున్నారు. ఈ పత్రాలను ఏ మాత్రం పరిశీలించకుండా హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు బహుళ అంతస్థుల భవనాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు.దీంతో అనేక ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, నిషేధిత ప్రాంతాల్లో ఆకాశాన్ని తాకే బహుళ అంతస్థుల భవనాలు, విల్లాలు వెలిశాయి. ఈ అక్రమాలకు కారకులైన అధికారులు, అధికారయంత్రాంగంపై హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకోనుందనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

### అక్రమార్కులపై చర్యల సంగతేంటి....

అక్రమ నిర్మాణాలపైన హైడ్రా ఉక్కుపాదం మోపింది. గండిపేట్, హిమాయత్‌సాగర్ చుట్టూ వెలిసిన నిర్మాణాల కూల్చివేతలు సంచలనంగా మారాయి. వాటి వెనుక ఉన్న వ్యక్తులు ఏ స్థాయికి చెందిన వాళ్లయినా లెక్కచేయకుండా కూల్చివేయడం బాగానే ఉంది. కానీ ఈ అక్రమ నిర్మాణాలకు అనుమతులను ఇచ్చిన అధికారుల సంగతేంటి అనేది ప్రశ్నార్థకంగా మారింది. నగర శివార్లలోని గ్రామాల్లో అప్పటి సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు మొదలుకొని వివిధ స్థాయిలకు చెందిన అధికారులు భవనాల నిర్మాణాలకు అనుమతులను ఇచ్చారు. చెరువులు, కుంటలు ఉన్న చోట నీటిపారుదల శాఖ కొన్ని చోట్ల ఇప్పటికీ ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించకపోవడం గమనార్హం. జంటజలాశయాల్లో గండిపేట్ ఎఫ్‌టీఎల్‌ను గుర్తించినప్పటికీ హిమాయత్‌సాగర్‌కు మాత్రం ఇప్పటి వరకు ఫైనల్ ఎఫ్‌టీఎల్ నిర్ధారించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. అలాగే చాలా చోట్ల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదలతో ఏటా పెద్ద ఎత్తున నీటమునుగుతున్నా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలకు అనుమతులను ఇస్తూనే ఉన్నారు. గండిపేట్ వద్ద తాజాగా హైడ్రా కూల్చివేసిన స్పోర్ట్స్ విలేజ్‌ను 2016లోనే అక్రమ కట్టడం అని గుర్తించినప్పటికీ అప్పటి నుంచి ఇప్పటి వరకు చర్యలు లేవు. అలాగే జంటజలాశయాల పరిధిలో ఇప్పటి వరకు సుమారు 600 ఎకరాలకు పైగా భూముల్లో ఫామ్‌హౌస్‌లు, ప్యాలెస్‌లు, విల్లాలు వెలిశాయి. అనేక సంవత్సరాలుగా అధికారులు అడ్డగోలుగా అనుమతులనిస్తూనే ఉన్నారు. కోర్టులు, హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న సందర్భాల్లో మాత్రమే అక్రమాలను గుర్తిస్తున్నారు. కానీ ఇప్పుడు వీటి కూల్చివేతలకు ఏకంగా హైడ్రా ఏర్పడిన దృష్ట్యా ఇలాంటి నిర్మాణాలకు బాధ్యులైన అధికారులపైన ఎలాంటి చర్యలు తీసుకోనుందనేది ఆసక్తికరంగా మారింది.

### 111 జీవో సంగతేంటి.?

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల పరీవాహక ప్రాంతాలను కాపాడేందుకు 1996లో ప్రభుత్వం జీవో 111 ను అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏ పరిధిలోని 82 గ్రామాలు ఈ జీవో పరిధిలో ఉన్నాయి. సుమారు 1.30 లక్షల ఎకరాల భూమి విస్తరించింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏదో ఒక స్థాయిలో ఈ జీవో చర్చనీయాంశమవుతూనే ఉంది. మరో వైపు జీవోను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ పర్యావరణ సంస్థ లు, సామాజిక కార్యకర్తలు న్యాయస్థానాల్లో పోరాడుతున్నారు. ఒకవైపు ఇలా వివిధ రకాలుగా ట్రిబుల్ వన్ జీవో నిర్వీర్యమవుతున్న పరిస్థితుల్లోనే చాపకిందనీరులా అక్రమ నిర్మాణాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఈ అక్రమాలకు అడ్డుకట్టవేయవలసిన అధికారయంత్రాంగం ప్రేక్షకపాత్రకు పరిమితమైంది. శంషాబాద్, శంకర్‌పల్లి, తదితర ప్రాంతాల్లో హెచ్ఎండీఏ అధికారులు అడ్డగోలుగా చేంజ్ ఆఫ్ లాండ్ యూజ్ సర్టిఫికెట్‌లను ఇచ్చేశారు. దీంతో వందల సంఖ్యలో బహుళ అంతస్థుల భవనాలు వెలిశాయి. . ఇలా జీవో 111 పరిధిలో వెలిసిన నిర్మాణాలపైన ఎలాంటి చర్యలు తీసుకోనున్నారనేది ఆసక్తికర అంశం.

## కవితతో ములాఖత్ కానున్న కేటీఆర్, హరీష్



**జనపదం, న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అయి గత కొన్ని నెలలుగా తీహార్ జైలులో ఉంటోంది. ఈ క్రమంలో నిన్న జైలులో అస్వస్థతకు గురికాగా, వెంటనే ఆమెను జైలు అధికారులు ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఆరోగ్యం నిలకడ అయిన తర్వాత తిరిగి కవితను తీహార్ జైలుకు అధికారులు తరలించారు. కాగా.. జైలులో ఉన్న కవితతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు శనివారం ములాఖత్ కానున్నారు. కవిత అనారోగ్యం గురించి తెలిసిన వెంటనే మాజీ మంత్రులు కవితను కలిసేందుకు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. కాగా.. నిన్న జైలులో అస్వస్థతకు గురైన కవితకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించారు. కవిత గైనిక్ సమస్యలు, వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. జైలు డాక్టర్ల సిఫారసు మేరకు వైద్య పరీక్షల నిమిత్తం కవితను ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గతంలో కూడా కవిత అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలోనూ ఆమెను ఎయిమ్స్‌కి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితను మార్చి 15వ తేదీన ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆ తరువాత సీబీఐ సైతం ఆమెను కస్టడీలోకి తీసుకుంది. ఈ రెండు దర్యాప్తు సంస్థల కేసుల్లో కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు. బెయిల్ కోసం ఇప్పటికే అనేకసార్లు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఆమె బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసినా.. ఈడీ ఇంకా కౌంటర్ దాఖలు చేయలేదు.



## ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా..?

- ప్రజాపాలనలో పడకేసిన ప్రజారోగ్యం
- విష జ్వరాలతో జనం పరేషాన్
- పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణలో సర్కార్ ఫెయిల్
- రోగులతో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు ?
- విష జ్వరాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి.
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ

**జనపదం, హైదరాబాద్ :** ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు హయాంలో ప్రజారోగ్యం పూర్తిగా పడకేసిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్ర యంత్రాంగమంతా ప్రజారోగ్య వ్యవస్థను గాలి కొదిలేయడంతో జనం విషజ్వరాలతో మంచం పట్టే దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. గత ఎనిమిది నెలలుగా పారిశ్యుద్ధ నిర్వహణ పూర్తిగా దిగజారి పోయిందని, ఫలితంగా తీవ్రమైన దోమల బెడద కారణంగా డెంగీ, మలేరియాతోపాటు చికెన్ గున్యా లాంటి జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని చోట్లా రోగుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడం ఆందోళన కలిగించే పరిణామమన్నారు. వర్షాకాలానికి ముందే ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజన్ కు ముందే విష జర్వాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్న కనీస అవగాహన కూడా ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. ఫలితంగానే ఇప్పుడు ప్రజలంతా ఇలా విష జ్వరాల బా రిన పడే దుస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు.

### అధికారిక లెక్కల ప్రకారమే..

ఈ ఏడాదిలో దాదాపుగా 5,700 డెంగీ కేసులు నమోదయ్యాయని, కానీ అనధికారికంగా దీనికి పది రెట్లు ఎక్కువగా ఈ సంఖ్య ఉంటుందని తెలిపారు. డెంగీకి సరైన సమయంలో చికిత్స అందకపోవడం వల్ల ఒక్క డెంగీతోనే ఇటీవల దాదాపు 50 మంది చనిపోయారని, ఇందులో చిన్నపిల్లలు కూడా ఉండటం అత్యంత బాధాకరమన్నారు. మొన్నటికి మొన్న ఒక్క రోజులోనే డెంగీ తో ఐదుగురు చనిపోయిన సంఘటన ప్రతిఒక్కరిని కలిచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. గత మూడు నెలలుగా విష జ్వరాల బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

### అవస్థల్లో ఉంటే ఢిల్లీ టూర్లా..


ప్రభుత్వాస్పత్రుల్లో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడం, సరిపడా మందులు కూడా లేని కారణంగా జనం ప్రైవేట్ హాస్పిటల్స్ వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని కేటీఆర్ వాపోయారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆసుపత్రులు పేద, మధ్యతరగతి ప్రజల జేబులు గుల్ల చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అటు ఆరోగ్యం ఇటు డబ్బులు పోగుట్టుకుని జనం అవస్థలు పడుతుంటే.. పట్టించుకోవాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి రాజకీయ యాత్రలు చేయడం దారుణమని కేటీఆర్ దుయ్యబట్టారు. విజృంభిస్తున్న విషజ్వరాలతో పెద్దసంఖ్యలో చిన్నపిల్లలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. అనేక చోట్ల బెడ్లు దొరకక అవస్థలు పడుతున్నారని, పిల్లల ఆరోగ్య సంరక్షణలో ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదని అని కేటీఆర్ మండిపడ్డారు.

### ప్రాణం పోతే తప్ప చలనం రాదా...

ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ కీలకమైన అంశంలో కూడా ముఖ్యమంత్రి మొద్దు నిద్ర వీడటం లేదని, ప్రజారోగ్యంపై సీఎం స్థాయిలో నిరంతరం సమీక్షలు జరగని కారణంగానే వైద్యారోగ్య శాఖ ఈ స్థాయిలో విఫలమైందని స్పష్టం కేటీఆర్ స్పష్టం చేశారు. అత్యంత ప్రాధాన్యమైన ప్రజా ఆరోగ్యం అంటే ఈ ముఖ్యమంత్రికి పట్టింపు లేదా అని కేటీఆర్ నిలదీశారు. ప్రజల ఆరోగ్యంకన్నా తమకు తమ పార్టీ స్వప్రయోజనాలే ముఖ్యం అన్నట్టుగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తోందన్నారు. ఇంకా ఎంతమంది డెంగీ సహా ఇతర విషజ్వరాలతో ప్రాణాలు కోల్పోవాలని, ప్రాణం పోతేనే ప్రభుత్వంలో చలనం వస్తుందా అని కేటీఆర్ నిలదీశారు.

### పంచాయతీలపై చిన్నచూపు

విష జర్వాలు ప్రబల కుండా ఉండాలంటే ముందుగా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, దోమల బెడద లేకుండా ఇప్పటికైనా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలు, పురపాలికలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఈ ఏడాది సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అటు పంచాయతీలను, ఇటు పురపాలికలను పట్టించుకున్న నాథుడే లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం దోమల నివారణ మందులు కొట్టేందుకు కూడా పైసలు ఇవ్వకపోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఆరోగ్యం గాలిలో దీపంలా మారిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు కాస్త ఆలసమైనా ఇబ్బంది ఉండదు కానీ.. ఒక్కసారి ప్రాణం పోతే ఏం చేసినా తిరిగి తీసుకురాలేమనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఇకనైనా గ్రహించాలని కేటీఆర్ స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వర్షాకాలానికి ముందే ప్రజారోగ్యంపై సమీక్షలు, ముందస్తు ప్రణాళికలు ఉండేవని, ప్రభుత్వ సన్నద్ధత వల్ల జ్వరాలు ప్రబలకుండా అన్నిరకాల చర్యలు తీసుకునే వారిమని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ ముందుచూపు లేకపోవడం వల్లే రాష్ట్రంలో ప్రజారోగ్యం పతనావస్థకు చేరుకుందని కేటీఆర్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ఇకనైనా రాజకీయాలపై దృష్టి పెట్టడం మాని రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగీ, మలేరియా ఇతర విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తే సగం సమస్య పరిష్కారమవుతుందని కేటీఆర్ సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక కేంద్రాల్లో ఇప్పటికైనా అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడాలని కేటీఆర్ బహిరంగ లేఖలో ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.



## మళ్లీ తెరుచుకోనున్న శ్రీశైలం గేట్లు

**జనపదం, బ్యూరో :** శ్రీశైల జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ఈ ఏడాది మరోమారు డ్యామ్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. గత జులై 29న రెండేళ్ల తర్వాత గేట్లు ఎత్తి 15 రోజుల పాటు నాగార్జునసాగర్ కు నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రస్తుతం నీటిమట్టం 884.20 అడుగులగా.. ఇన్ ఫ్లో 1,37,849 క్యూసెక్కులుగా ఉంది. 884.50 రాగానే రాత్రికి లేదా రేపు ఉదయం ఒకటి లేదా రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేసేందుకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు అంతా సిద్ధమవుతున్నారు.

# క్రిస్టియానో రొనాల్డో యూట్యూబ్ రికార్డ్..

## 24 గంటల్లో 20 మిలియన్ల సబ్‌స్క్రైబర్స్ రూ.2.51 కోట్లు ఆదాయం..!



**జనపదం, స్పోర్ట్స్:** ప్రముఖ పోర్చుగీస్ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో స్పోర్ట్స్ ప్రియులకు సుపరిచితుడు. ఈ ఆటగాడు తాజాగా UR క్రిస్టియానో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించారు. రొనాల్డో యూట్యూబ్ ఛానెల్ 'UR క్రిస్టియానో' కేవలం 24 గంటల్లో 23 మిలియన్ల సబ్‌స్క్రైబర్ల సంఖ్యను దాటేసింది. ఈ క్రమంలో క్రిస్టియానో యూట్యూబ్ ఛానెల్ వేగంగా 20 మిలియన్ల సబ్‌స్క్రైబర్‌లను చేరుకున్న మొదటి యూట్యూబర్‌గా రొనాల్డో నిలిచాడు. ఛానల్ ప్రారంభించిన 24 గంటల్లోపే ఈ రికార్డు సృష్టించాడు. యూట్యూబ్‌లో అత్యంత వేగంగా 20 మిలియన్ల సబ్‌స్క్రైబర్‌లను సంపాదించిన రికార్డు గతంలో మిస్టర్ బీస్ట్ పేరిట ఉంది. మిస్టర్ బీస్ట్‌గా పేరుగాంచిన జిమ్మీ డొనాల్డ్‌సన్. తన యూట్యూబ్ ఛానెల్‌ని ప్రారంభించిన రెండేళ్లలోనే ఈ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇప్పుడు ఈ విషయంలో రొనాల్డో అతని కంటే ముందున్నాడు.

**12 గంటల్లో డైమండ్ ప్లే బటన్**

యూట్యూబ్ నుంచి రొనాల్డోకు బోలెడన్ని అవార్డులు కూడా వచ్చాయి. ఈ క్రమంలో రొనాల్డో కేవలం 22 నిమిషాల్లోనే సిల్వర్ ప్లే బటన్, 90 నిమిషాల్లో గోల్డెన్, 12 గంటల్లో డైమండ్ ప్లే బటన్‌ను అందుకున్నాడు. యూట్యూబ్ లో లక్ష మంది సబ్‌స్క్రైబర్‌లను పొందితే సిల్వర్ ప్లే బటన్, 10 లక్షల మంది సబ్‌స్క్రైబర్‌లను పొందితే గోల్డ్ ప్లే బటన్, 10 మిలియన్లు లేదా కోటి మంది సబ్‌స్క్రైబర్‌లను పొందితే డైమండ్ ప్లే బటన్ లభిస్తుంది. యూట్యూబ్ నుంచి ఈ అవార్డు అందుకున్న తర్వాత రొనాల్డో తన కుమార్తెలతో ఈ ఆనందాన్ని పంచుకున్నాడు. ఆయన తన కుమార్తెల ముందు యూట్యూబ్ ప్లే బటన్‌ను చూపుతున్న వీడియోను పోస్ట్ చేశాడు. రొనాల్డో ఛానెల్లో ఇప్పటివరకు 19 వీడియోలు పోస్ట్ చేయబడ్డాయి.

**అత్యంత ప్రజాదరణ**

యూట్యూబ్‌లో అత్యధిక సంఖ్యలో సబ్‌స్క్రైబర్‌ల రికార్డు మిస్టర్ బీస్ట్ పేరిట ఉంది. ఆయనకు 311 మిలియన్ (31 కోట్ల కంటే ఎక్కువ) సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. తాజాగా టీ సిరీస్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు. టీ సిరీస్‌కు 272 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అయితే రొనాల్డో పాపులారిటీ తీరు చూస్తుంటే రాబోయే రోజుల్లో అన్ని రికార్డుల బ్రేక్ చేసి నెంబర్ వన్ కానున్నాడు.

### సంపాదన ఎంత?

యూట్యూబర్‌లకు మిలియన్ (10 లక్షలు) వీక్షణల కోసం సుమారు 6 వేల డాలర్లు (దాదాపు రూ. 5 లక్షలు) అందిస్తారు. వీడియోల సమయంలో కనిపించే ప్రకటనల ద్వారా వారికి ఆదాయం వస్తుంది. ఈ నేపథ్యంలో రొనాల్డో ఒక రోజులో దాదాపు $300,000 అంటే రూ. 2.51 కోట్లు సంపాదించాడని నివేదికలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే మరోవైపు రొనాల్డోకు ఇన్ స్టా, ఫేస్ బుక్, ట్విట్టర్‌లోనూ మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. రొనాల్డోకు X ప్లాట్‌ఫారమ్‌లో 112.5 మిలియన్లు, ఫేస్‌బుక్‌లో 170 మిలియన్లు, ఇన్‌స్టాగ్రామ్‌లో 636 మిలియన్ల మంది ఫాలోవర్లు కలరు.

# క్రికెటర్ షకీబ్‌పై మర్డర్ కేసు..



**జనపదం, స్పోర్ట్స్:** బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్‌పై మర్డర్ కేసు నమోదైంది. రఫీకుల్ ఇస్లామ్ ఈ కేసు దాఖలు చేశారు. ఆగస్టు 7వ తేదీన జరిగిన ర్యాలీలో రఫీకుల్ కుమారుడు రూబెల్ మరణించాడు. అడోబార్ రింగు రోడ్డులో జరిగిన ర్యాలీ సమయంలో కాల్పుల్లో రూబెల్ మృతిచెందాడు. అయితే ఈ ఘటనకు చెందిన అడోబార్ పోలీసు స్టేషన్ కేసు నమోదు చేశారు. ఆ కేసులో 28వ నిందితుడిగా షకీబ్ పేరును చేర్చారు. బంగ్లా పాపులర్ నటుడు ఫెర్దౌస్ అహ్మద్‌ను 55వ నిందితుడిగా చేర్చారు. ఈ ఇద్దరూ అవామీ లీగ్ పార్టీకి చెందిన మాజీ ఎంపీలు. రూబెల్ మృతి కేసులో మొత్తం 154 మంది నిందితుల్ని చేర్చారు. దాంట్లో ప్రధాని షేక్ హసీనా కూడా ఉన్నారు. ఈ కేసులో మరో 500 మంది గుర్తు తెలియని వ్యక్తుల్ని నిందితులుగా చేర్చారు. మరో వైపు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా ఫారూక్ అహ్మద్ పేరును ప్రకటించారు. ఆ పోస్టుకు నజ్ముల్ హసన్ రాజీనామా చేశారు. హసీనా ప్రభుత్వంలో క్రీడామంత్రిగా కూడా నజ్ముల్ చేశారు.

# డైమండ్ లీగ్ లో చోప్రాకు సెకెండ్ ప్లేస్..

**6వ ప్రయత్నంలో 89.49 మీటర్ల దూరం విసిరిన నీరజ్**



**జనపదం, స్పోర్ట్స్:** జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన ఈవెంట్‌లో.. ఆరో ప్రయత్నంలో నీరజ్ తన జావెలిన్‌ను 89.49 మీటర్ల దూరం విసిరాడు. ఈ సీజన్‌లో నీరజ్‌కు ఇదే బెస్ట్ త్రో. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ తన జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరాడు. 2022లో స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 89.94 మీటర్ల దూరం విసిరాడు. ఇదే అతని కెరీర్‌లో బెస్ట్ త్రో. నిజానికి లాసానే డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా చాలా కష్టపడ్డాడు. మొదటి 5 ప్రయత్నాల్లో అతను 82.10మీ, 83.21మీ, 83.13మీ, 82.34మీ, 85.58మీ దూరం విసిరాడు. గ్రెనిడాకు చెందిన అండర్సన్ పీటర్స్ ఈ సీజన్‌లో మీట్ రికార్డు క్రియేట్ చేశాడు. అతను 90.61 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. జర్మనీకి చెందిన జులియన్ వెబర్ 87.08 మీటర్ల దూరం విరిసి మూడో స్థానంలో నిలిచాడు.

# కేఎల్ రాహుల్ రిటైర్మెంట్..!

- **సోషల్ మీడియాలో పోస్ట్ వైరల్..**
- **అధికారికంగా ప్రకటించని ఆటగాడు..**



**జనపదం, స్పోర్ట్స్:** భారత క్రికెట్ జట్టు స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ పై ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఆయన పేరుతో చేసిన చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్టుపై దుమారం రేగుతోంది. అందులో ఆయన రిటైర్మెంట్ ప్రకటించినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో కేఎల్ రిటైర్మెంట్ ప్రకటించినట్లు చెబుతున్నారు. కేఎల్ రాహుల్ ప్రొఫెషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ తీసుకున్నట్లు పోస్ట్‌లో పేర్కొన్నారు. దీంతో పాటు వివక్షతో ఇబ్బంది పడుతున్న కారణంగానే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోస్ట్‌లో తెలిపారు. అయితే ప్రస్తుతానికి రాహుల్ మాత్రం ఇంకా అధికారికంగా రిటైర్మెంట్ గురించి ప్రకటించలేదు. ఈ విషయాన్ని ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. అందులో రాహుల్ కీలక ప్రకటన చేయాల్సి ఉందని రాశారు. అయితే రాహుల్ ఏం ప్రకటించబోతున్నారో చెప్పలేదు. ఈ క్రమంలోనే ఆయనకు సంబంధించిన అనేక ఫేక్ పోస్టులు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. ఇందులో రిటైర్మెంట్ గురించి చర్చలు జరుగుతున్నాయి.

**దులీప్ ట్రోఫీలో**

ఇటీవలే శ్రీలంక పర్యటనలో వన్డే జట్టులో కేఎల్ ఎంపికయ్యాడు. మొదటి వన్డేలో రాహుల్ 31 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. కాగా రెండో వన్డేలో డకౌట్ అయ్యాడు. సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభమయ్యే దేశీయ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీకి కూడా కేఎల్ ఎంపికయ్యాడు. రాహుల్ శుభమన్ గిల్ కెప్టెన్‌గా ఉన్న A జట్టులో ఉన్నాడు. సెప్టెంబరు 5న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో టీమ్ బీతో మొదటి మ్యాచ్ జరుగుతుంది.

## CINEMA NEWS సినిమా పదం

# హైదరాబాద్ లో పుష్ప-2 టీం

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ నటిస్తున్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. ఈ మూవీ అప్‌డేట్ గురించి ఎదురుచూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం ఆసక్తికర వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం పుష్ప ది రూల్ క్లైమాక్స్‌ను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. అంతేకాదు మేకర్స్ స్పెషల్ సాంగ్ షూట్ చేయడానికి రెడీ అవుతుండగా.. క్లైమాక్స్ షూట్‌తో అగ్రభాగం షూట్ పూర్తి కానుందట. చివరి షెడ్యూల్‌లో స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. క్లైమాక్స్ పూర్తయిన తర్వాత సాంగ్ షూట్‌పై నిర్ణయం తీసుకోబోతున్నారని టాక్. ఈ మూవీని 2024 డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. రిలీజ్ అప్‌డేట్ పోస్టర్‌లో బన్నీ పుష్పరాజ్‌గా కత్తి పట్టుకుని ఊరమాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.






# మేఘా ఆకాశ్ ఎంగేజ్మెంట్

**మేఘా ఆకాశ్** నితిన్ నటించిన లై సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ భామ ఇటీవలే విజయ్ ఆంటోనీ నటించిన తుఫాన్ (తెలుగులో) సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఓ వైపు సినిమాలతో బిజీగా ఉన్న మేఘా ఆకాశ్ మరోవైపు వ్యక్తిగత జీవితంలో కీలక అడుగు వేసింది. ఈ బ్యూటీ ఇటీవలే తన ప్రియుడు సాయి విష్ణుతో నిశ్చితార్థం పూర్తి చేసుకుంది. మేఘా ఆకాశ్ ఈ విషయాన్ని తెలియజేస్తూ ఫొటోలు షేర్ చేసింది. ఈ ప్రైవేట్ సెర్మనీకి కుటుంబ సభ్యులు, సన్నిహితులు హాజరయ్యారు. మేఘా ఆకాశ్-సాయి విష్ణు ఆరేండ్లుగా ప్రేమలో ఉన్నారు. ఫైనల్ గా లవ్ లైఫ్ నుంచి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతున్నారు. మేఘా ఆకాశ్-సాయి విష్ణు ఎంగేజ్‌మెంట్ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.




# ఇంద్ర ఫస్ట్ డే కలక్షన్స్ 3 కోట్లు

**మెగాస్టార్ చిరంజీవి** పుట్టిన రోజు సందర్భంగా థియేటర్లలోకి మళ్ళీ వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ ఇంద్ర. ఈ చిత్రం వరల్డ్ వైడ్ గా డే 1 సూపర్ రెస్పాన్స్ ను సొంతం చేసుకుంది. మొదటి రోజు 3.05 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టింది. ఇది సెన్సేషన్ రెస్పాన్స్ అని చెప్పాలి. ఈ చిత్రాన్ని నిర్మించిన వైజయంతి మూవీస్ వారు మొదటి రోజు రీ రిలీజ్ వసూళ్లను పోస్టర్ ద్వారా వెల్లడించారు. బీ. గోపాల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆర్తీ అగర్వాల్, సోనాలి బింద్రే కథానాయికలుగా నటించారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ ఈ చిత్రానికి అధ్భుతమైన సంగీతం అందించాడు



# సూపర్ యోధ జననం..

టాలీవుడ్ యంగ్ యాక్టర్ తేజసజ్జా హను-మాన్ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో మంచి పేరు తెచ్చుకున్నాడు. టాలెంటెడ్ యాక్టర్ పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయి చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదల చేసిన ఈ మూవీ టైటిల్ గ్లింప్స్ వీడియోకు మంచి స్పందన వస్తోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికానాయక్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తేజ సజ్జా బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఇంటెన్స్ లుక్ ఒకటి విడుదల చేశారు. తేజ సజ్జా ఎత్తైన భవంతిపై నుంచి ఓ ఐరన్ రాడ్‌ను పట్టుకుని తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నట్టుగా కనిపిస్తున్న పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఎడ్రినలిన్ రైడ్ ఫీల్ అందించే సూపర్ యోధ జననం.. అంటూ విడుదల చేసిన తాజా లుక్‌తో ఈ సినిమా యాక్షన్ మూవీ లవర్స్ ను ఇంప్రెస్ చేయడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీలో మంచు మనోజ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రం 2025 ఏప్రిల్ 18న 2డీ, 3డీ వెర్షన్లలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# రవితేజకు గాయం



**మాస్ మహారాజ రవితేజ** ఇటీవల వచ్చిన మిస్టర్ బచ్చన్ తరువాత భాను భోగవరపు డైరెక్టర్‌గా రవితేజ కెరీర్‌లో 75వ చిత్రంగా నటిస్తున్నాడు. ఈ సినిమాను RT75 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. అయితే, ఈ సినిమా షూటింగ్‌లో రవితేజకు గాయమైనట్లుగా తెలుస్తోంది. RT75 చిత్ర షూటింగ్‌లో ఆయన కుడిచేతికి గాయం అయ్యింది. అయినా కూడా ఆయన షూటింగ్‌లో పాల్గొనడంతో, గాయం తీవ్రత ఎక్కువయ్యింది. దీంతో ఆయనకు యశోద ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఆయన ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారని తెలుస్తోంది. రవితేజ కెరీర్‌లో మైల్‌స్టోన్ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో అందాల భామ శ్రీలీల మరోసారి ఆయనకు జోడీగా నటిస్తోంది. ఇక ఈ సినిమాకు 'కోహినూర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు మేకర్స్.

# ఓటీటీలోకి తుఫాన్

**తమిళ ప్రముఖ నటుడు**, సంగీత దర్శకుడు విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన మూవీ "తూఫాన్". దర్శకుడు విజయ్ మిల్టన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో మేఘా ఆకాష్ హీరోయిన్‌గా నటించింది. అయితే ఈ సినిమా థియేటర్స్ లోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే ఓటీటీలోకి వచ్చేసింది. తమిళ్ లో గత వారమే అందుబాటులోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు తెలుగులో కూడా స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ సినిమా హక్కులు ప్రముఖ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకోగా ఇప్పుడు ఇందులోనే తెలుగులో కూడా స్ట్రీమింగ్ కి వచ్చేసింది. మరి విజయ్ ఆంటోనీ సినిమాలు చూడాలనుకునే వారు ఈ చిత్రాన్ని ఇందులో చూడొచ్చు.






Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com